

తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు


# తెలంగాణ జీవగడ్డ

ఎడిటర్:
మోటపలుకుల వెంకట్ డిజిటల్ పత్రిక








ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , శుక్రవారం 13-03-2026 సంపుటి :02 సంచిక : 157 పేజీలు :04 వెల : 3.00






# గ్యాస్ కొరత

## గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

**న్యూఢిల్లీ, మార్చి 12:** ఇరాన్, అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. గురువారం లోక్‌సభలో దేశంలో వంట గ్యాస్ కొరతపై రాహుల్ గాంధీ ప్రసంగించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా - ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు.గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. రష్యా ఆయిల్‌ను కొనడానికి ఎవరి అనుమతి కావాలి? అంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు.భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికిందన్నారు. ఎప్‌స్టీన్‌తో పరిచయం ఉందని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ చెప్పారని ఈ సందర్భంగా ఎంపీ రాహుల్ గాంధీ గుర్తు చేశారు.పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. అంతే కాకుండా ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.






## పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకే: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి12:** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు.

2 లో




ఢిల్లీ: తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ నేడు విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు

2 లో

## యూరియా కోసం
## కేంద్రానికి లేఖ



**హైదరాబాద్, మార్చి 12:** ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

2 లో

తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్:
మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక



# వేడి తగులుతోంది!

ఎక్కడో యుద్ధం జరుగుతూంటే మనకేమిటన్న ప్రశాంతత లేకుండా చేసింది ఇరాన్. పాలకులు ఎలాగూ నోరువిప్పడం లేదు, కనీసం ప్రజలైనా గొంతెత్తాలంటే ఈ మాత్రం శిక్షతప్పదని అనుకుందేమో మరి. వంటిట్లో పొయ్యి వెలగక, కడుపు నకనకలాడితే జనమే తమ నేతలమీద తిరగబడతారనీ ఒత్తిడిపెంచుతారనీ ఇరాన్ తెలివిడి. పదిరోజుల యుద్ధంలో ఇరాన్ ఎంత నష్టపోయిందో తెలియదు కానీ, మిగతా ప్రపంచమంతా ఇంధన కొరతలు, సరఫరాల నిలిపివేతలతో విలవిలలాడేట్టు చేయడంలో అది పైచేయి సాధించింది.వేగంగా ఇరాన్‌ను చావుదెబ్బతీసి, పాదాక్రాంతం చేసుకొని, తమకు విధేయుడైన ఓ పాలకుడిని ప్రతిష్ఠించగలనని నమ్మకంగా కదనరంగంలోకి దూకిన ట్రంప్‌మీద కాలువెనక్కుతీసుకోమంటూ అన్నివైపుల నుంచీ ఒత్తిడి పెరుగుతోంది. ఇరాన్ సంధిస్తున్న చవుకబారు డ్రోన్లు గల్ఫ్‌లోని అమెరికా వందిమాగధ దేశాలన్నింటినీ ఊపిరాడనివ్వకుండా చేస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిని గుప్పిట్లో పెట్టుకొని, బ్యారెల్ భగ్గుమనేట్టు చేసి, యుద్ధం ఆపేది లేదని ఇరాన్ ఎదురు సవాళ్ళు విసురుతోంది. ఆయిల్ షాక్‌కు ప్రపంచం అల్లాడిపోతోంది, సూచీలు తలకిందులవుతున్నాయి. పూచికపుల్లలాంటి ఇరాన్ ఆయుధాల ధాటికి ఒకపక్క ఆయిల్ నిల్వలు తగలబడుతూంటే, మరోపక్క నిల్వచేసుకొనే వీలులేక ఇరాక్, కువైట్, అరబ్ ఎమిరేట్స్ ఇత్యాది దేశాలు చమురు ఉత్పత్తిని భారీస్థాయిలో కుదించాల్సి వస్తున్నది. అణ్వాయుధాలున్న ఒకదేశాన్ని దారికి తేవాలంటే ప్రపంచం ఎంతోకొంత కోల్పోకతప్పదని మొదట్లో పెద్దపెద్దమాటలు చెప్పిన అమెరికా అధ్యక్షుడు సైతం ఇప్పుడు దిగివచ్చి మాట్లాడుతున్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థను కుదిపేసే స్థాయిలో పరిస్థితులు మారిపోతూండటం వల్ల త్వరితగతిన యుద్ధాన్ని ముగించడం గురించి ట్రంప్ మాటమాత్రంగానైనా అనవలసి వస్తోంది. అయతొల్లా ఖొమేనీని హత్యచేశాక ఆయన కుమారుడే వచ్చి ఆ కుర్చీలో కూర్చున్నారు. ఇలా ఎందరిని వధించుకుంటూ పోయినా మతవారసులే వస్తారు తప్ప, ఇరాన్ కాళ్ళబేరానికి దిగదు. ఒకపక్క శత్రువుల చేతిలో చావుదెబ్బలు తింటూ కూడా ప్రతీకారంగా ఇరాన్ కొడుతున్న ఆ చిన్నాచితకా దెబ్బలకు అమెరికా ఇజ్రాయెల్ దగ్గర ఉన్న అత్యాధునిక ఆయుధ నిల్వలు హరించుకుపోతున్నప్పుడు, యుద్ధం ఎంతకాలం కొనసాగితే అంత అవమానం తప్పదనీ, వీరాధివీరుడన్న తన ఇమేజ్ హరించుకుపోవచ్చునని అమెరికా అధ్యక్షుడికి తోచిందేమో. చమురు, సహజవాయువు సంక్షోభం స్వదేశాన్ని తాకుతూంటే, దాని గొలుసుకట్టు ప్రభావాలు జనం అనుభవిస్తూంటే అతిత్వరలోనే ఎన్నికలకు పోవాల్సి ఉన్న అధ్యక్షుడికి కాలువెనక్కు తీసుకోగలిగే మార్గం ఒకటి కావాలి. ఆప్తమిత్రుడు పుతిన్ ఈ విషయంలో ఏవో సలహాలు ఇచ్చాడని అంటారు.ఎదురొడ్డి పోరాడటమే తప్ప, రాజీ లేదని ఇరాన్ అంటోంది. యుద్ధం ఎంతకాలం సాగాలి, ఎప్పుడు ఆగాలి అన్నది ఎవరు నిర్ణయిస్తారో తెలియదు కానీ, ఉత్పత్తి మాట అటుంచితే, కనీసం ఇంధన నిల్వలను కాపాడుకోవడం కూడా గల్ఫ్‌లోని అమెరికా దోస్తులకు కష్టమైపోతోంది. అంతా సవ్యంగా ఉంది, గాలికబుర్లు నమ్మకండి అని మన దేశ పాలకులు చెబుతున్నప్పటికీ, హోటళ్ళు మూతబడుతూ, హాస్టళ్ళు రెండుపూటల తిండికే పరిమితమవుతూ గ్యాస్ సంక్షోభం క్రమంగా విస్తరిస్తోంది, రేపోమాపో మన వంటింటినీ తాకుతుంది. వాహనాల్లో చమురు లేక ఇంటి నుంచి పనిచేయడం సరే, సకల సరఫరాలూ నిలిచిపోయి కనీస అవసరాలు సైతం తీరని పాడుకాలమూ దాపురించవచ్చు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉన్న రష్యా నుంచి చమురుకొంటున్నందుకు ట్రంప్ నోట పలు అవమానకరమైన మాటలు పడి, భారీ సుంకాల దెబ్బలు తిని చివరకు ఆయనకే లొంగి దిగుమతులను వదులుకున్నాం. ఇప్పుడు మళ్ళీ అగ్రరాజ్యాధీశులవారు అనుమతించినందుకు ఎంతో సంతోషించి, విశ్వగురువులకు మాత్రమే దక్కిన గౌరవంగా మళ్ళీ కొనుగోళ్ళు మొదలుపెట్టి, ఒడ్డునపడవేసినందుకు ఎగిరిగంతేస్తున్నాం. ఒక యుద్ధాన్ని ఆపే పేరిట మనను చమురు కొనవద్దన్న పెద్దమనిషే, తాను ఆరంభించిన మరో యుద్ధం కారణంగా మనలను మళ్ళీ కొనమంటున్నాడు. అమెరికా అధ్యక్షులవారి ఏకపక్ష, నిరాధార యుద్ధం ఆరంభాన్ని అడ్డలేకపోయినా, ఆ ఉన్మాదాన్ని నిలువరించలేకపోయినా కనీసం ముగింపును త్వరితం చేయగల సమర్థత, సాన్నిహిత్యం మన ఏలికలకు ఉందని విశ్వసిద్దాం.

# గ్యాస్ కొరత-పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకే

హైదరాబాద్, మార్చి12:
తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు.రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు



ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# తెలంగాణ స్పీకర్ నిర్ణయమే ఫైనల్

పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు
ఢిల్లీ: తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ నేడు విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం నేడు తుది తీర్పు వెలువరించింది ఉన్నత న్యాయస్థానం. ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు.ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ



వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది.స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్టైంది.

# మంత్రి జేపీ నడ్డాకు లేఖ

హైదరాబాద్, మార్చి 12: ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు.తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జూలై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్టంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల అవసరమవుతుందని చెప్పారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.



తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్ డిజిటల్ పత్రిక





# కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవడమంటే ఇష్టం

భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ బుమ్రా టీ20 ప్రపంచకప్ విజయం గురించి మాట్లాడాడు. ఆ వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. తనకు కఠిన సవాళ్లు అంటే ఇష్టమని బుమ్రా పేర్కొన్నాడు.కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవడమంటే ఇష్టం: బుమ్రాస్పోర్ట్స్ డెస్క్: టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన శైలిలో బౌలింగ్ చేస్తూ.. ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తాడు. యార్కర్ బంతులను సంధిస్తూ బ్యాటర్లను వణికిస్తుంటాడు. ఓటమి ఖాయమనుకునే మ్యాచుల్లో సైతం తనదైన బౌలింగ్‌తో విజయాలను అందించాడు. సెమీ ఫైనల్లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ అందుకు నిదర్శనం. ఈ మ్యాచ్‌లో బుమ్రా బౌలింగ్ భారత్‌కు విజయాన్ని అందించిందని అనడంలో అతిశయోక్తి లేదు. ఇది ఇలా ఉంటే తాజాగా టీ20 ప్రపంచ కప్ విజయం గురించి బుమ్రా మాట్లాడాడు. ఆ వీడియోను భారత క్రికెట్ నియంత్రణ మండలి షేర్ చేసింది.ఆ వీడియోలో... 'నాకు కఠిన సవాళ్లు, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవడం అంటే ఇష్టం. అలాంటి సందర్భాల్లో మంచి ప్రదర్శన చేసి, సత్తా చాటినప్పుడు.. అది నాకు చాలా సంతోషాన్ని ఇస్తుంది. దానిలో వచ్చే ఆనందం మరెక్కడ దొరకదు. నేను గుజరాత్‌లోనే క్రికెట్ ఆడటం ప్రారంభించా. ఇప్పుడు ప్రపంచ కప్‌ను కూడా ఇక్కడే సాధించాం. ఫైనల్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలిచింది కూడా ఇక్కడే. ఇవన్నీ నాకు చాలా సంతోషాన్ని ఇస్తున్నాయి' అని బుమ్రా అన్నాడు.అహ్మదాబాద్ మైదానంలోనే వన్డే వరల్డ్ కప్ 2023లో భారత్ తృటిలో టైటిల్‌ను కైవసం చేసుకునే అవకాశాన్ని కోల్పోయింది. ఆ విషయాన్ని బుమ్రా గుర్తు చేసుకున్నాడు. 'గతంలో మేం తృటిలో ఓడిపోయాం. కానీ ఈ సారి విజయం సాధించాం. చాలా సంతోషంగా ఉంది. వరుసగా రెండు సార్లు టీ20 ప్రపంచకప్ గెలవడం అంటే మామూలు విషయం కాదు. దేవుడికి ధన్యవాదాలు' అని జస్ప్రీత్ బుమ్రా అన్నాడు. ఇక చరిత్రాత్మక టీ20 ప్రపంచ కప్ తర్వాత, జస్ప్రీత్ బుమ్రా ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున తిరిగి ఆడనున్నాడు.











# ధనుష్‌కు జోడీగా 'కాంతార' బ్యూటీ

ఇటీవల భాషా భేదం లేకుండా వరుస చిత్రాలతో దూసుకు పోతున్నాడు తమిళ స్టార్ హీరో ధనుష్ గతేడాది తమిళంలో రెండు తెలుగు, హిందీ భాషల్లో ఒక్కో సినిమా చొప్పున ప్రేక్షకుల ఎదుటకు వచ్చిన ధనుష్ ఈ ఏడాది కూడా అదే జోరు కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే.. పోర్ తొళిల్ ఫేమ్ విఘ్నేష్ రాజా దర్శకత్వంలో కర అనే చిత్రాన్ని పూర్తి చేసిన ఆయన ఇప్పుడు 'అమరన్' దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఇందులో సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తుండడం విశేషం.సినిమా సమీక్షలు-ఈ చిత్రం ఓ వైపు షూటింగ్ జరుగుతుండగానే.. 'లబ్బర్ పండు' ఫేం తమిళరసన్ పచ్చముత్తు దర్శ కత్వంలో తన 56వ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇందులో ధనుష్‌కు జోడీగా 'ఏస్', 'మదరాసి', 'కాంతార' తదితర చిత్రాల్లో కథానాయికగా నటించి దేశ వ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ను ఖరారు చేసినట్లు సమాచారం. 'ఉరియడి' విజయకుమార్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలుస్తోంది.ఇదిలా ఉంటే ధనుష్ నటిస్తున్న ఇళయ రాజా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం బయోపిక్‌లు సెట్స్‌పై ఉన్నాయి. మరోసారి తెలుగులో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం, హిందీలో ఆనంద్ ఎల్ రాయ్ సినిమా కూడా చర్చల దశలో ఉన్నట్లు వినికిడి. ఇలా ధనుష్ జయపజయాలు, భాషా భేదం లేకుండా సినిమాలు చేసుకుంటూ పోతూ తన తోటి నటులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇలా వేగంగా సినిమాలు చేస్తూ మోహన్ లాల్, మమ్ముట్టిలను మించి పోయేలా ఉన్నాడు.

